## దుబ్బాక ఎమ్మెల్యేపై దాడి చేయడం హేయమైన చర్య



మిరుదొడ్డి: మోతెలో బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్

మిరుదొడ్డి (అక్బర్‌పేట–భూంపల్లి), అక్టోబర్ 4 : కాంగ్రెస్ నాయకులు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పై కోడి గుడ్లతో దాడి చేయడం హేయమైన చర్య అని మోతె మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం అక్బర్‌పేట–భూంపల్లి మండలం మోతెలో బాధితురాలు జ్యోతికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దాడుల సంస్కృతిని తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనను గాలికి వదిలి హైడ్రాను తెచ్చి పేదల ఇండ్లను కూల్చుతూ సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని మండి పడ్డారు. బీఆర్ఎస్ నాయకులు రవి, రమేశ్, రంజిత్, బాపురెడ్డి, ఎల్లారెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి పూజలు



ఆలయ పునర్నిర్మాణానికి పూజలు చేస్తున్న వేద పండితులు

చేర్యాల, అక్టోబర్ 4 : పట్టణంలోని పెద్దమ్మగడ్డ ప్రాంతంలో మాతమ్మ దేవాలయ పునర్నిర్మానం కోసం శుక్రవారం వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ మాతమ్మ దేవాలయ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, పట్టణ నాయకులు ఆడెపు చంద్రయ్య, డాక్టర్ పరమేశ్వర్, ఆముదాల మల్లారెడ్డి, ముస్త్యాల బాల్‌నర్సయ్య, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, కౌన్సిలర్లు పచ్చిమడ్ల సతీశ్, చెవిటి లింగం, ముస్త్యాల కిష్టయ్య, పుర్మ వెంకట్‌రెడ్డి, పాల లక్ష్మీనారాయణ, భూమిగారి రత్నం, ఎర్రోళ్ల రామచంద్రం, కొమ్ము నర్సింగరావు పాల్గొన్నారు.

## 'మల్లన్న'ను దర్శించుకున్న పావనీగౌడ్ దంపతులు



మల్లన్నను దర్శించుకున్న పావనీగౌడ్ దంపతులు

చేర్యాల, అక్టోబర్ 4 : కొమురవెల్లి మల్లికార్జునస్వామిని శుక్రవారం బీఆర్ఎస్ సోషల్ మీడియా రాష్ట్ర అధికార ప్రతినిధి పావనీగౌడ్ దంపతులు దర్శించుకున్నారు.స్వామి వారిని దర్శించుకున్న వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి వచ్చిన పావనీగౌడ్ దంపతులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహేశ్ స్వాగతం పలికారు.

## వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ



టోర్నమెంట్ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, అక్టోబర్ 4 : మండలంలోని కడవేర్గులో ఈ నెల 7,8వ తేదీల్లో కొమ్మూరి యువసేన ఆధ్వర్యంలో నిర్వహించే జనగామ,సిద్దిపేట జిల్లాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల నిర్వహణ వల్ల అన్ని ప్రాంతాల యువకుల మధ్య స్నేహ భావం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు ఆరుట్ల వినీత్, దొంగల లింగారెడ్డి, తాడెం రమేశ్, నీరటి విజయ్, ఎస్‌డీ నౌషత్, గదరాజు నరేశ్, సురేందర్ పాల్గొన్నారు.

## అందరూ నైతిక విలువలు కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఖలేద్ ముబాషీర్ ఉజ్ జాఫర్

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 4 : నైతిక విలువలు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జమాయితే ఇస్లామ్ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఖలేద్ ముబషీర్ ఉజ్ జాఫర్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జమాయితే ఇస్లామ్ హింద్ 75 ఏండ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు. సమాజంలో శాంతి, సామరస్యాలను పెంపొందించడానికి జమాతే పనిచేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణ బిలుపై జమాతే తీవ్ర ఆందోళన చెందుతుందన్నారు. తెలంగాణ సర్కార్ వక్ఫ్ఆస్తుల పరిరక్షణకు దృఢవైఖరి మార్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం, హైడ్రా చేపడుతున్న కూల్చివేతలపై ప్రజల్లో తీవ్ర నిరసనలు, ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయని, సాధారణ ప్రజల పట్ల ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. సమావేశంలో నయీమొద్దీన్ అహ్మద్, అలీ మొద్దీన్,ఇర్షాద్, మీర్ జాఫరుల్లా తహర్, అబ్దుల్ ఖుద్దుస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయురాలిపై ప్రశంసల వర్షం



ఉమారాణిని సన్మానిస్తున్న నిర్వాహకులు

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 4 : తెలంగాణ సాహిత్య అకాడమీ, నాట్యా కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం బతుకమ్మ 2024 సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపాక మండలం మర్పడగ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఉమారాణి పాల్గొని తన కవిత గానాన్ని వినిపించారు. దీంతో ఆహుతులందరూ ఉమారాణిపై ప్రశంసల వర్షం కురిపించడంతో పాటు శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నామోజు బాలచారి, డాక్టర్ మామిడి హరికృష్ణ, తెలంగాణ రాష్ట్ర నాట్య అకాడమీ చైర్మన్ అలేఖ్య పాల్గొన్నారు.

## నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 4 :నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరమని బీఆర్ఎస్ కొండపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ దవాఖానలో చికిత్స పొందిన కొండపాక మండలంలోని దుద్దెడకు చెందిన పలువురు బాధితులకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన అందజేశాడు. లబ్ధిదారులు అప్పటి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామశాఖ అధ్యక్షుడు చిలుముల రామ్మోహన్, నాయకులు పిల్లి నాగరాజు, ఆంజనేయులు, భాను, పల్లె బాబు, పరశురాములు, రాకేశ్ పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి, అక్టోబర్ 4: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 37 మంది లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

## గాయత్రీదేవి..నమోస్తుతే!

### జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు



మద్దూరు(ధూళిమిట్ట): లద్నూర్‌లో పూజలు చేస్తున్న అర్చకుడు రాజేశ్‌శర్మ



సిద్దిపేట టౌన్: కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు



రాయపోల్: రాయపోల్‌లో దుర్గామాత విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు గాయత్రీదేవిగా కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాత మండపాల్లో కుంకుమార్చనలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకుని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ,అక్టోబర్ 4 :




మిరుదొడ్డి :మిరుదొడ్డిలో దేవీ అమ్మ వారికి పూజలు చేస్తున్న భక్తులు



గజ్వేల్: కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



వర్గల్: వర్గల్‌లో సరస్వతీమాతను దర్శించుకుంటున్న భక్తులు



కోహెడ: సముద్రాలలో కొలువుదీరిన దుర్గామాత

## పంటకు పచ్చిరొట్టతో బలం



రంగధాంపల్లిలో వరిపొలాన్ని పరిశీలిస్తున్న ఏవో శ్రీనాథ్, వ్యవసాయాధికారులు

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 4 : పచ్చిరొట్ట ఎరువులను భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బక్రిచెప్యాల, రంగధాంపల్లి గ్రామాల్లో వరి, జీలుగ పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటను సాగు చేయడానికి 45 రోజుల ముందు పచ్చిరొట్ట పైర్లు అయిన జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి వాటిని పెంచి పూతదశలో కలియ దున్నడం ద్వారా పంటకు ప్రధాన పోషకాలు ఎక్కువ మొత్తంలో అందుతాయన్నారు. పచ్చిరొట్ట వ్యర్థాలు భూమిలో కుళ్లి ఎరువుగా మారి భూసారం పెరుగుతుందన్నారు. ప్రతి రైతు పచ్చిరొట్ట పైర్లను పెంచి భూమిలో కలియదున్నుకోవడం ద్వారా ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చని, తద్వారా ఖర్చు తగ్గుతుందని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజేశ్, పవన్ పాల్గొన్నారు.

## హుస్నాబాద్ కోర్టు ఎదుట న్యాయవాదుల ధర్నా



హుస్నాబాద్ కోర్టు ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

హుస్నాబాద్, అక్టోబర్ 4: హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో న్యాయవాదిపై పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ హుస్నాబాద్ మున్సిఫ్‌కోర్టు ఎదుట శుక్రవారం న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్ మాట్లాడుతూ న్యాయవాదులపై రోజురోజుకూ దాడులు అధికమవుతున్నాయని, పోలీసులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దాడులకు పాల్పడటం సరికాదన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు రామృకృష్ణ, మల్లేశం, చిత్తారి హన్మయ్య, జూమ్‌లాల్, కొత్తపల్లి దేవేందర్, ఇజ్జగిరి అజయ్‌కుమార్, దీకొండ ప్రవీణ్, పిట్టల దేవదాసు, ఉప్పరపెల్లి సంపత్ పాల్గొన్నారు.

### నేడు వెంకటస్వామి జయంతి

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 4: మున్సిపల్ ఆధ్వర్యంలో శనివారం కేంద్ర మాజీ మంత్రి జి. వెంకటస్వామి జయంతి నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జున్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం తొమ్మిది గంటలకు జయంతి నిర్వహించడం జరుగుతుందని, పాలకవర్గసభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు

## ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 4 : ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా స్థాయి అధ్యయన తరగతులు శుక్రవారం జరిగాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధ్యాయులు సమాజం, సంఘం పట్ల లోతైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన అందుతుందనే విషయాన్ని అందరికీ తెలియ చెప్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి,షేక్ వలీ అహ్మద్,యాదగిరి,ప్రభావతి,కృష్ణ,నిర్మల,ప్రశాంత్,గిరిబాబు,కనకరాజు,రాజిరెడ్డి,నగేశ్,శివలింగం తదితరులు పాల్గొన్నారు.

### అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 4 : నూతనంగా నిర్మించిన ఇంటికి తెచ్చిన అప్పు ఎలా తీరుతుందో అనే బెంగతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొండపాకలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మహేశ్ నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఇంటి నిర్మాణానికి తెలిసిన వారి వద్ద రూ.3లక్షలు తీసుకువచ్చాడు. కొద్ది రోజులుగా తెచ్చిన అప్పు పెరిగిపోతుందని, దాన్ని ఎలా తీర్చాలో అని ఆలోచిస్తున్న అతడు శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంట్లో వ్యభిచారం ..పోలీసుల దాడి

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 4 : ఇంట్లో వ్యభిచారం జరుగుతుండంతో టాస్క్‌ఫోర్స్,వన్ టౌన్ పోలీసులు దాడి చేసి నలుగురు విటులు, మహిళలను పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట శివాజీ నగర్ చెందిన చంద్రమౌళి ఇంట్లో మహిళలను తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తున్నాడనే నమ్మదగిన సమాచారం వచ్చిందన్నారు. పోలీసులతో కలిసి దాడి చేయగా శ్రీనివాస్, వెంకటేశ్, శంకర్, ప్రసాద్ నలుగురు విటులు, ఓ మహిళను అదుపులోకి తీసుకొని రూ. 2 వేల నగదు, 6 సెల్‌ఫోన్లు, మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిర్వాహకుడు చంద్రమౌళి పరారీలోఉన్నాడన్నారు.

## ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బాలనర్సయ్య

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 4 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాలనర్సయ్య అన్నారు. శుక్రవారం కుకునూరుపల్లి మండలం తిప్పారంలో సాయికుమార్ ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. అనంతరం మహాసభలో నూతన గ్రామకార్యదర్శిగా నరహరి, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా సాయికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులు తాటోజు రవీంద్రాచారి, ఎల్లయ్య, భాగ్యమ్మ పాల్గొన్నారు.

## కూలీలకు సకాలంలో పనులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్,అక్టోబర్ 4: కూలీలకు సకాలంలో పనులు కల్పించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 2024–25 సంవత్సరంలో (ఈజీఎస్‌లో) చేపట్టబోయే పనులపై ఏపీవో,ఈసీ,టీఏ, ఈజీఎస్ సిబ్బందికి జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో నర్సరీలకు స్థల అన్వేషణ చేసుకొని భూమిని చదును చేసి ఎక్కువ శాతం విత్తనాలు సేకరించి ఎర్రమట్టి, నల్లమట్టిని సమకూర్చుకోవాలన్నారు. జిల్లాలో శనిగరం, సింగరాయకొండ, తపాస్‌పల్లి జలాశయాల్లో డిస్ట్రిబ్యూషన్ కెనాళ్లలో పూడిక తీత, కలుపుమొక్కల తొలిగింపు ప్రక్రియ కోసం ఇరిగేషన్,ఈజీఎస్ అధికారులు కలిసి పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి జయదేవ్ ఆర్యా, అడిషనల్ పీడీ బాలకృష్ణ, ఏపీడీ శివాజీ,ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ కోర్టులో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న జడ్జి శివరంజని, మహిళలు

హుస్నాబాద్, అక్టోబర్ 4: హుస్నాబాద్ మున్సిఫ్‌కోర్టు ఆవరణలో ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబురాలు జరిగాయి. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ వేడుకల్లో జడ్జి శివరంజనితో పాటు మహిళా న్యాయవాదులు, న్యాయవాదుల కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు. బతుకమ్మలను పేర్చి కోర్టు ఆవరణలో ఒకచోట ఉంచి బతుకమ్మ ఆటపాటలతో అలరించారు. చిన్నలు, పెద్దలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి శివరంజని మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో బతుకమ్మ వేడుకలు జరుపుకుంటారని, ఈ వేడుకల ప్రత్యేకతను రాబోయే తరాలకు అందించడం మన బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



సిద్దిపేట అర్బన్: ఇందూర్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

### ఇందూర్ కళాశాలలో..

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 4 : సిద్దిపేట పట్టణ శివారులోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థినులు బతుకమ్మ ఆడుతూ ఉత్సాహంగా గడిపారు. తెలంగాణ సంప్రదాయానికి పెద్ద పీట వేస్తూ సుమారు 250 మంది విద్యార్థినులు ఈ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీపీ రాజు, వైస్ ప్రిన్సిపాల్ బెనర్జి, పీఆర్‌వో బొడ్డు రఘు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఏసీపీ మధు

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 4 : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సిద్దిపేట ఏసీపీ మధు అన్నారు.టూటౌన్ పరిధి కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో శుక్రవారం రాత్రి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.కాలనీలో ఎవరైనా కొత్త వ్యక్తులు,నేరస్తులు షెల్టర్ తీసుకుంటే సమాచారం ఇవ్వాలన్నారు. ఏ సమస్యలు ఉన్నా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. సైబర్ నేరస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీఐ ఉపేందర్,ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

కెనాల్‌లో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధి నర్సాపూర్‌కు చెందిన రాజు(34) శుక్రవారం స్థానికంగా ఉన్న కెనాల్‌లో చేపలు పట్టడానికి వెళ్లాడు.ఈ క్రమంలో కెనాల్‌లో పడి మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

గజ్వేల్, అకోట్బర్ 4: మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సల్ల నరేశ్ బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ కావడంతో చికిత్స పొందుతూ విషమించి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కౌన్సిలర్ అర్చనాశివకుమార్, నాయకులు ఎన్సీ సంతోష్, భిక్షపతి పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



మద్దూరు(ధూళిమిట్ట),అక్టోబర్4: మద్దూరు మండలంలోని నర్సాయపల్లికి చెందిన కడవేర్గు యశోద ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామ మాజీ ఉపసర్పంచ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ శనిగరం సత్యనారాయణ మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. శనిగరం కనకయ్య, మోకు కనకారెడ్డి, మంతెన శ్రీపతిరెడ్డి, ఆడెపు శ్రీనివాస్, కడవేర్గు సుదర్శన్, ఆడెపు రాజు, బింగి విఠల్ పాల్గొన్నారు.

## టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా లింగం



మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 4: టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆదేశాల మేరకు టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ధూళిమిట్ట మాజీ ఉపసర్పంచ్ పోతరాజుల లింగంను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్ ప్రకటించారు. శుక్రవారం లింగంకు రాజేందర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోతరాజుల లింగం మాట్లాడుతూ సంఘం అభివృద్ధితో పాటు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు పోతరాజుల లింగంను పలువురు నాయకులు అభినందించారు.

## కొనసాగుతున్న పోలీస్ పికెటింగ్



కొమురవెల్లి, అక్టోబర్ 4 : మండలంలోని గురువన్నపేటలో ఐదు రోజులుగా హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ ఆధ్వర్యంలో చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై రాజుగౌడ్ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇటీవల మైనర్ బాలికపై పక్కింటి యువకుడు లైంగికదాడి నేపథ్యంలో గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు గ్రామంలో పికెటింగ్ నిర్వహిస్తున్నారు.

## న్యాయమూర్తిని కలిసిన ఏసీపీ



సిద్దిపేట టౌన్,అక్టోబర్ 4 : సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవిని ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న డ్రంక్ అండ్ డ్రైవ్, ఎంవీ యాక్ట్ కేసులను ఆమెకు వివరించారు.


**గౌరవనీయులైన ప్రధాన జిల్లా కోర్టు, సిద్దిపేట గారి సమక్షంలో**
**GW O.P.No. 19 of 2024**

**Between:**
పార్వతి @ మామిడి శబరీ (Minor – మామిడి మహేందర్) ...పిటిషనర్
మరియు
మామిడి బిక్షపతి ...ప్రతివాది

ప్రతివాది: మామిడి బిక్షపతి, తండ్రి: రాజాగౌడ్, గ్రామం: సింగాటం, గజ్వేల్ మండలం మరియు ఎవరైనా ఇతరులు.

శ్రీమతి పార్వతి @ మామిడి శబరీ తన కుమారుడు అయిన మామిడి మహేందర్ పేరున ఉన్న ఆస్తి అనగా వ్యవసాయ భూమి సర్వే నెం. 93/ఆ లో ఎ. 0–06 గుం. మరియు సర్వే నెం. 93/ఊ లో ఎ. 0–24 గుం. (మొత్తం ఎ. 0–30 గుం. భూమి) తిప్పారం గ్రామం, కుకునూరుపల్లి మండలం, సిద్దిపేట జిల్లా లోనిది, ఇతరులకి అమ్మడానికి ప్రధాన జిల్లా కోర్టు, సిద్దిపేట యొక్క అనుమతి/పర్మిషన్ కొరకు దరఖాస్తు చేసినది. పైన తెలుపబడిన ఆస్తి కొరకు ఎవరికైనా అభ్యంతరాలు/ఆక్షేపణలు ఉన్నవారు ప్రధాన జిల్లా కోర్టు, సిద్దిపేటను ప్రత్యక్షంగా/ న్యాయవాది ద్వారా కానీ సంప్రదించగలరు. ఇట్టి కేసు ఈనెల తేది: **21-10-2024** నాడు హాజరు కొరకై ఉన్నది. కావున, ఆరోజు ఉదయం **10.30** వరకు సంప్రదించగలరు. లేనిచో, గౌరవ న్యాయస్థానం ఎవరికీ అభ్యంతరాలు /ఆక్షేపణలు లేనట్టుగా భావించగలదు.

**కోర్టు ఆదేశానుసారం**
**V.RAJA REDDY, T.PRAVEEN REDDY, V.NAGARAJU,** Advocates
Siddipet.